
# కడలిగర్భంలో కాపురం



*కడలితో కాపురం. ఒడిదుడుకులు తప్పవు. కాని, ఎదురీదటు కూడా తప్పదా!.... తప్పుతుంది: అది మంచి వాళ్ళ మనసులాగా ఉండే సంద్రపు నడిమధ్యాన!*

---

**తూరుపు** కొండ ఎరుపెక్కింది.

ప్రాణికోటికి మెలకువ వచ్చింది. కడలి ముసుగులోనుంచి కమలబాంధవుడు కన్ను విప్పాడు. జలరాశినుంచి లేచిన సూర్యబింబం, జలంలో మునిగిలేచిన మౌని శాంతివదనంలా ఉంది.

చూచునంతలో ప్రొద్దు బారెడు పైకి జరిగింది. చూపుల్లో కొంచెం కరకు పెరిగింది. తరణి అరుణకిరణాల కొరడా చురుకుమనేసరికి కెరటాల తురగాలకు ఉరకల్లో చురుకు వచ్చింది. పరుగున ఉరికి దరికి ఎగురుతున్నాయి. ధరణిపైకి దూకలేక మోకరిల్లి విరివిగా నురగలు విడుస్తున్నాయి.

ఉదయకాంతుల్లో అలలగంతుల్లో సాగరం సంతోషాల మెరుగు దిద్దుకుని మురిసిపోతుంది. పొద్దు పొడుపుల్లో సముద్రమ్మీదికి వేటకు వెళ్ళిన నావలు తెరచాపలతో వెళ్ళగొడుగుల్లా లేస్తున్నాయి. సమరంలో వ్యూహాలు పన్నినట్లు పడవలు సముద్రంలో బారులుతీరి తేలియాడుతున్నాయి.

సందడితో ఎగిరిపడుతున్న రంగాలపై పందెంతో పరుగిడుతున్న తురంగాలా దరికి దూసుకువస్తున్నాయి నావలు. దరికి వేరే కొలది దూరదూరంగా ఉన్న పడవలన్నీ ఒక్క దారికి చేరుకుంటున్నాయి. నావలన్నీ మొగ (సాగరసంగమం) చెంతకు చేరాయి. తొలి నావ వెలియలికట్టు దాటింది. ఆ వెనుకనే ఒక్కొక్క

పడవ నదిలో ప్రవేశించింది. ప్రతీ నావకు ఇద్దరూ ముగ్గురూ జాలరులున్నారు. వారి మొగాలు విజయగర్వంతో వెలిగిపోతున్నాయి.

పల్లెపడతులంతా ఏటిదరికి ఉత్సాహంతో వచ్చి మూగారు. గంపల కెత్తుతున్న చేపలను చూచి మురిసిపోతున్నారు. ఆ గుంపులో ఓ పడుచు చుక్కల్లో చందమామలా ఉంది. ఆ కన్నె లేడి కన్నార్పకుండా తిన్నగా నావల్లోకి చూస్తోంది. నిముషాలు గడిచాయి. చకోరికి చంద్రదరిసెనం దొరకలేనట్టుంది. చూపుల్లో ఆత్రుత అధికమయింది. మనసులో ఆందోళన ఆవరించింది.

"గంగత్తా!" ప్రక్కనున్న ముత్తైదువను పిలిసింది.

"ఎందుకే?" పలికింది ఆమె గొంతు.

"మీ యబ్బాయేడీ? కనిపించటంలేదు." సిగ్గుతో మగువ పెదవులు తటపటాయించాయి.

ఆమెకూడా కాస్సేపు నావలకేసి దృష్టి నిలిపింది. మగనిని పిలిసి అడిగింది. అందరి దృష్టి మరిడిమీదకు మళ్లింది. "ఏమయ్యాడంటే ఏమయ్యాడు?" ఎవరిమట్టుకు వాళ్లే ప్రశ్నించారు.

"మరిడియ్యతో ఉన్న గున్నయ్యేడో చూడండి" అన్నాడొకడు గుంపులోనుంచి.

గున్నయ్యకోసం చూశారు. అతడూ కాన రాలేదు. "అయితే పడవ తప్పిపోయి ఉంటాది" అని అప్పటికి నిర్ణయించారు.

ఆ పలుకులు కన్నె లేత గుండెను కలవర పరిచాయి. నిలువునా నీరయింది. దుఃఖం ముంచుకువచ్చింది.

"కంటతడి పెట్టకు భాగమ్మా! పడవ దారితప్పి ఉంటాది."

"రేపు వేటకు వెళ్లతాంగా వెదకి పట్టుకొత్తాం." అబలకు అప్పటికి ధైర్యం చెప్పారు.

నావ తప్పిపోయిందో! నడిసముద్రంలో మునిగిపోయిందో!! మళ్లీ మరిడి, గున్నయ్యలను కళ్లచూత్తామన్నమాట వాళ్లకూ అనుమానమే.

సాయంత్రానికల్లా ఆ వార్త చుట్టుప్రక్కల పల్లెలకు పాకిపోయింది. పక్క పల్లెలో ఉన్న భాగమ్మ తల్లి మాణిక్యమ్మకు ఈ కబురు వినేసరికి, ఇక కాలూ చేయీ ఆడలేదు. ఎలా ఉన్నది అలానే వచ్చి కూతురుచెంత వాలింది. తల్లిని చూచేసరికి భాగమ్మలో దాగి ఉన్న దుఃఖం గట్టుతెగి పారింది. "అమ్మా!" అంటూ తల్లి ఒడిలో కూలిపోయింది.

తల్లిని పట్టుకుని కూతురు, కూతుర్ని పట్టుకుని తల్లి గొల్లుమన్నారు.

"మాణిక్కోదినా! పెద్దదానవు నువ్వే అంతయిదైపోతే ఎలా? పిల్లదాన్నేదో సముదాయించాలిగాని, నువ్వుకూడా దానితో ఏడుత్తూ కూచుంటే అది మరీ బెంబేలెత్తిపోతాది." పక్కింటి వృద్ధురాలు వచ్చి మందలించింది.

"కడుపుతీపే అనుకో ఏంజేత్తాం! దిగమింగుకోవాలి."

"నిద్దర బద్దకాన్నుంటే పడవ దారి తప్పుంటాది."

"భాగమ్మ తాడు గట్టిదైతే ఏదో మొగకు చేరుకుంటారు."

ఇరుగుపొరుగమ్మలు చేరి తలోమాటా అన్నారు. వారి మాటలు దుఃఖాన్ని కొంచెం శాంతపరిచాయి. పాపం భాగమ్మ ఇంకా తల్లి ఒడిలోనే తలదాచుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

నాలుగు రోజులు గడిచాయి. రోజూ సముద్రమ్మీదకు వేటకు వెళ్లుతున్నారు; వస్తున్నారు. కాని మరిడి నావ జాడలేమీ దొరకలేదు. కింద మొగలో వారికి పై మొగలోవారికి కూడా కబురు అందజేశారు. వారు ఏ జాడా దొరకలేదని కబురు పంపారు.

రోజు రోజుకు భాగమ్మ హృదయంలో ఆందోళన ఎక్కువయింది. కూడు నోటికి సహించటంలేదు. తల్లి రోజూ బ్రతిమాలి దగ్గర కూర్చుని మందలించేది. ఓ ముద్ద రెండు ముద్దలు తప్ప ఎక్కువ నోటికి వెళ్లేది కాదు. "పోయినోళ్లతోటి పోతామేంటే!

## కె. పట్టాభిరామయ్య

ఏదో యిట్టం చేసుకుని నాలుగు మెతుకులు తినాలిగాని" అని అప్పుడప్పుడు కసిరేది మాణిక్యమ్మ.

ఆ మాటకు అసలే నలిగిపోయి ఉన్న భాగమ్మ పసి హృదయం ఎంత తల్లడిల్లేదో ఆ తల్లికేం తెలుసు. గొడ్డలిపెట్టులా తగిలిన ఆ మాటకు గుండె బ్రద్దలుకాగా, కుమిలి కుమిలి ఏడ్చేది.

భాగమ్మ ఆ రోజు కారోజు నీరసించి పోతూంది. కూర్చున్నకడనే కూర్చుంటుంది. నిలబడ్డచోటనే నిల్చుంటుంది. ఎప్పుడూ తడి ఆరని కళ్లతో ఎక్కడికో చూస్తూ, ఏదో ఆలోచనల్లో తేలుతూ పరాకుగా ఉంటుంది.

వారం తిరిగింది. మరిడి గున్నయ్యలకోసం చూడటంలో ఆత్రుత తరిగింది. ఇక వారు మరణించారనే నిర్ణయానికి వచ్చారు. తొందరలోనే మైల మాపివేయటానికి నిశ్చయించారు.

ఆ రోజు—

భాగమ్మ పాలిట పరమ శత్రువయ్యింది. పడుచు మెడలోని నల్లపూసలు తెగి ఏటిలో ఏకమయ్యాయి. ముగ్ధ మొగమ్మీద కుంకుమ రేఖ రాలి నేలపాలయ్యింది. చిన్నారి చేతుల గాజులు ముక్కలై మట్టిలో మట్టయ్యాయి. సంఘ నిబంధనలకు బలియై సహజ సౌందర్యాన్ని కోలుపోయింది. రెమ్మలు విరిగిన పూలమొక్క అయ్యింది ఆ గడియలో ఆమె లేతమనసు ఎంత బాధపడి ఉంటుందో పాపం! చిత్రవధచేసినా అంత బాధపడి ఉండదు. ఏ వందల చిత్రవధల వ్యథనో అనుభవించి ఉంటుంది.

* * *

"భాగీ!.....భాగీ!...." మగత నిద్దరలోవున్న భాగమ్మ చెవిలో తంబుర తీగలా మ్రోగింది.

ఉలికిపడి కనులు విప్పింది. పిలిసేది ఎవరా? అని ఆలకించింది.

"అబ్బ!... ఈ మొద్దు నిద్దరెప్పటిసుంచబ్బిందే? భాగీ!" ఈసారి గొంతు కొంచెం గట్టిగా పలికింది.

పలుకు ఈసారి మెలకువలోనున్న ఆమెచెవిలో అమృతాన్ని చిలికింది. హృదిలో ఆనందాన్ని కెలికింది.

"ఆ గొంతు మావదే." మనసులో అనుకుని "వత్తున్నా మావా!" పరుగున వచ్చి తలుపు తీసింది.

కారుమబ్బు తొలగిన చందమామలా తళుక్కుమన్నాడు మరిడిమావ భాగమ్మ కళ్లలో. ఒళ్లంతా కళ్లు చేసుకుని తన మావను ఎగాదిగా చూసింది భాగమ్మ. మరిడి మొగంనిండా నవ్వు నిండింది. ఆ నవ్వులో వెన్నెలజల్లు పడుతుంది. ఓ క్షణం రెప్పవేయకుండా మావ ముఖంలోనికి సూటిగా చూసింది.

"ఏం భాగీ! అలా చూత్తున్నావ్?" చూపుల్లోనే చిలిపిగా ప్రశ్నించాడు మరిడి.

ఆ చూపులో ఆమె ప్రతి అణువు ఆనందంతో నిండింది. ఆనందాశ్రువులు పొంగాయి. కనుకొలకుల్లో నిండాయి. ఉబ్బిన ఉబలాటంలో శరీరం సత్తువ కోలుపోయింది. కాళ్లు ఇక నిలద్రొక్కుకోలేకపోయింది.

"మావా!" బావురుమంటూ గడపదాటి మరిడి గుండెలపై వాలిపోయింది.

తూలిపోతున్న లతకు అతడు తరువై నిలచాడు. తరువుకు లత చుట్టుకుపోయింది. ఆనందంతో పెదవులు కదలలేదు. కౌగిళ్లలో కలుసుకున్న హృదయాలు మూగగా మాట్లాడుకున్నాయి. తన్మయంతో కనులు మూతలు పడ్డాయి.

క్షణాలు గడిచాయి. మరిడి కన్నులు విడిచాయి. తన జాలిగుండెలో దాచుకున్న భాగమ్మ ముఖాన్ని మృదువుగా పట్టి యెత్తి ఆ ముగంలోకి ముద్దుగా చూశాడు. కలువ మొగంలోకి జాబిలి చూపులను నిలిపినటులుందా మధుర నిరీక్షణ. అతివ కనురేఖల్లో ఆనందాశ్రువు లింకా ఆరలేదు. అవి నీటి బొట్టులు కావు. చంద్ర దర్శనంతో కలువరేకుల్లో పొంగిన అమృత బిందువులు.

"ఇన్నాళ్లు నన్నొదిలి ఎక్కడున్నావ్ మావా?" చంటిపిల్లలా గారంగుడిచింది.

సమాధానంగా మరిడి చేతిలో భాగమ్మ లేత బుగ్గలు నలిగిపోయాయి. దొండపళ్లలాంటి పెదవులు విచ్చుకున్నాయి. ఆనందంతో అందుకున్నాడు మరిడి.

"ఉండు మావా!" చెలి సిగ్గు కనబరసింది.

**(తరువాయి 54 వ పేజీలో)**

సిగ్గుతో కనులు వింతసోయగాన్ని పులుము కున్నాయి.

"విన్నాదలి నేమండగలనా? అందుకేగా పడి సంద్రంలో చిక్కినా తప్పించుకుని నీపక్క వాలిత." బుజ్జగించాడు.

"ఇకమంచి నన్నొంటిగా వదలి నువ్వెక్కడికి వెళ్లొద్దు మావా!"

"అయితే మరి పొట్టలోకి బువ్వెలా వత్తాది?" చిలిపిగా నవ్వాడు.

సమాధానం తోచక అమాయకంగా చూసింది భాగమ్మ.

"పిచ్చిపిల్లా! పగలనకుండా, రేత్తిరనకుండా కూడూ గుడ్డకోసం దేవుల్లాడుకునే మనలాంటి వాళ్లకు ఇక్కడ కాపురం చేయాలంటే ఎడ బాటు తప్పదు."

"మరెక్కడ తప్పుతుంది?"

"ఇన్నాళ్ల నేమన్నచోట. అక్కడ ఉందీ, లేదు అన్న బెంగలేదు. ఎప్పుడూ సంతోషంతో గంతు లేయువచ్చు. ఎంత ఆడినా, పాడినా అసూయ పడేవాళ్లే లేరు."

"అయితే ఇంకనేం అక్కడికే పోదాం." సంబర పడింది.

"ఇప్పుడే పోదాం." భాగమ్మ చేయి అందుకుని దారితీశాడు మరిడి. సంతోషంతో మావ జంటను నడిచింది భాగమ్మ.

ఆత్మలు ఆనందంతో పొంగితూగాయి. అడుగులు తేలికగా ముందుకు సాగాయి. తిన్నగా ఏటి ఒడ్డుకు చేరారు. వెన్నెలరాత్రి. ఇసుక తిన్నెలో కాలుమోపేసరికి వారి కాళ్లు లేడి గంతులు గంతాయి. చల్లని వెన్నెలలో ఇసుక తిన్నెలలో అలా జంటగా గంతుతుంటే మల్లె పువ్వుల్లాంటి వలువల్లో మేనులు దాచుకున్న ఆ మిథునం స్వేచ్ఛగా తిరుగాడుతున్న హంసల జంటలా ఉంది.

ముందు తాను నావమీదకు దూకాడు మరిడి. చేయి అందించి, భాగమ్మను లాగాడు. ఆఊపుకు వచ్చి మరిడిపై బడింది. మళ్లీ వారి మేనులు అల్లుకుపోయాయి.

కదలింది నీటిలో తెడ్డు. వదలింది పడవ ఒడ్డు.

శుక్లపక్ష ద్వాదశిచంద్రుడు చక్కగా నవ్వు తున్నాడు. మబ్బులేవీ అడ్డులేనిమూలంగా ఆ నవ్వులను అడ్డుకునే మొనగాడు లేకపోవటంతో ఎడతెరపిలేకుండా జల్లుతున్నాడు. ఆ నవ్వుల్లో ప్రకృతి అంతా వెండి మెరుగు పెట్టినట్లు మెరు స్తుంది.

తెడ్డు వూపుతో పడవ ఒక్కొక్క అడుగే ముందుకు వేస్తూంది. మరిడి తెడ్డు వేస్తు న్నాడు. భాగమ్మ ఎదురుగా కూర్చుంది. ఓసారి పైనున్న చందమావ వంక చూసింది. ఓసారి నరసమున్న మరిడి మావ వంక చూసింది. కోమలి మదిలో అమరాగం మూసింది. కోకిల కంఠం కూనిరాగం తీసింది.

# కడలిగర్భంలో...

( 11వ పేజీ తరువాయి)

"పైనున్న చందమావ
పక్కనా మరిడి మావ
రెప్పవేయక నన్ను
నిక్కి నిక్కి చూత్తుంటే
చెప్పరాని సిగ్గేదో
కప్పి ముంచెత్తింది."
"చందమావ వెన్నెల్లో
మరిడి మావ నవ్వుల్లో
మోడైన నా బతుకు
మళ్లి చిగురించింది."

పాట నిలిచింది. పడవ సముద్రాన్ని సమీ పించింది. మరిడి పరాకు వదిలి చురుగ్గా తెడ్డు వేయసాగాడు. ఒక్క ఊపులో పడవ నదినిదాటి ఉదధిలోన్కి దూకింది. మదించిన ఏనుగుల్లా గోలచేస్తూ పరుగున వస్తున్న కెరటాలను ఎంతో మెలకువగా దాటిస్తున్నాడు.

నావ కెరటమ్మీదికి ఎగిరినప్పుడు ఆకాశాన్ని అందుకున్నంత అనుభూతి; అంతలోనే పాతా ళాన్కి దిగిపోతున్నామేమో అన్న భీతి. పడవ ఒక్కొక్క కెరటాన్నే దాటుతూ ఒడ్డుకు దూరమౌతుంది. దరి దూరమయ్యేకొలది అలల విజృంభణ సన్నగిల్లింది. చిరుగంతుల్లో ప్రశాం తంగా ఉన్న కడలి మధ్యన పడవ ఉయ్యాల లూగుతూ తేలుతూంది.

"బయట అంత అల్లరిచేసే ఈ సంద్రం మయాన ఎంత చల్లగా ఉంది మావా!" ఉల్లా సంగా ఊపిరి వదలింది.

"మంచివాళ్ల తీరే అంత! మాటల్లో కరుకు ఉన్నా మనసులు వెన్న." ఉత్సాహంగా పెదవులు కదిలాయి.

భాగమ్మ కనులు ఆనందంతో దశదిశలకేసి మిలమిల మెరిశాయి. ఆకాశం చుట్టూ నీటి లోనికి దిగిపోయింది. చుక్కలతో మెరిసిపోతూ ముత్యాలపరదా దిగవేసినట్లుంది. సాగరగర్భం ఆ దంపతులకు అందాల మందిరంలా ఉంది. మెల్లగా ఊగుతున్న నావ ఉయ్యాల మంచంలా ఉంది. మధురస్మృతులతో మనసులు మైమరి చాయి.

"మావా!" అనురాగంతో అతని ఒడిలో సోలిపోయింది.

"ఎప్పుడూ ఇక్కడే ఉండిపోదాం." అను రాగం తీగసై మ్రోగింది.

"ఇలా జంటగా కలకాలం ఈ సంద్రమ్మ

మీ దీక్ష
మన దేశానికి
రక్ష

యానే కాపురం చేద్దాం." వెచ్చని కౌగిలిలో బిగించాడు.

* * *

త్రుళ్లిపడి లేచింది భాగమ్మ. అప్పుడు ఆమె మొగం కలకలలాడుతూంది. కళ్లు నలుముకుని, చుట్టూ కలయజూచింది. ఆ క్షణంలో ఆమె వదనం వెలవెలబోయింది. తను మామూలుగా నేలమీద తల్లి ప్రక్కనే పడుకుని ఉంది. ఓ క్షణం మనోదృష్టి వెనుకకు మళ్లించి "అంతా కలా!" గట్టిగా గాలి పీల్చి విడిచింది. ఇంకా ఆమె మనసు ఊహాలోకంలోనే ఊగిస లాడుతూంది.

దిగులుగా ఉన్న ఆమె మొగంపై ఎందుకో చిరునగవు వెలసింది. నవ్వుతూనే పైకి లేచింది. ఒళ్లు తెలియకుండా నిద్రపోతున్న తల్లి మొగంలోకి ప్రేమగా జూచింది. చూపులోనే కళ్లల్లో నీళ్లునిండి నేలకు రాలాయి.

"నేను మావను విడిచి ఉండలేను. నేనూ మావవద్దకే పోతా." మనసులోనే గొణు క్కుంది.

గుండె దిటవు చేసుకుంది. కళ్లనీళ్లు తుడుచుకుంది. గుమ్మంకేసి అడుగు వేసింది. గడియతీస్తున్నప్పుడు ఆమె చూపులు ఆకులు రాలిన మోడుల్లా ఉన్న బోడిచేతులపై బడింది. చూపులోనే మనసులో ఏదో తలపు మెదలింది. గిరుక వెనుకకు తిరిగింది. చిలక్కొయ్యకున్న పూసలపేరుతీసి రెండు ముక్కలుచేసి మొండి చేతులకు చుట్టబెట్టుకుంది. అద్దం అందు కుని నీడ చూచుకుంది. నెలరాజు కనరాని కాళ రాత్రిలా ఉంది మొగం. సెలయేరు కరువైన ఎడారిలా ఉంది మెడ. కుంకుమరేఖలేని మొగాన్ని, మంగళసూత్రంలేని మెడను చూచుకునేసరికి కళ్లల్లో నీళ్లు తిరిగాయి. కుంకుమబరిణె తీసి నొసట బొట్టు పెట్టుకుంది. పసుపుకొమ్ము దారానికి ముడివేసి మెడలో కట్టుకుంది. క్షణంలో సుమంగళి అయింది.

ఈసారి అద్దంలో చూచుకుంది. ముసి ముసిగా నవ్వుకుంది. ఈ పట్టు ఉత్సాహంతో గుడిసెను దాటింది.

అప్పటికి చంద్రుడు పడమటిదిశకు వ్రాలు తున్నాడు. వెన్నెల పుచ్చపువ్వుల్లా ఉంది. ఎక్కడా ఏ అలికిడీ లేదు. ప్రకృతి అంతా కునుకు తీస్తూంది.

పైటచెంగును నెత్తిమీదకు తీసుకుని ముసుగు కప్పుకుంది. మెల్లగా అడుగులువేస్తూ పల్లెను దాటింది. ఏటి ఒడ్డుకు వచ్చింది. పడవలు దరిని కట్టబెట్టి ఉన్నాయి. ఓ పడవను ఎక్కింది. తాడు వదలింది. నావ కదలింది. సముద్రం చందమామను అందుకోవాలనే ఉల్లాసంతో పొంగిపోతూంది.

భాగమ్మ మరిడిమావను చేరుకోవాలనే ఉబలాటంతో పొంగిపోతూంది.

పడవ చెలియలికట్ట దాటింది.

కడలి గర్భంలోకి దారి తీసింది. ★